ఓయూలో 'రుద్రం' కలరి ప్రదర్శన

మహిళల్లో ఆత్మరక్షణపై అవగాహన పెంపే లక్ష్యం: షర్మిల రాఘవ





దశ, ఓయూ: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో 'రుద్రం' పేరుతో భారతీయ సంప్రదాయ యుద్ధకళ కలరిపయట్టు ప్రదర్శన నిర్వహించడం గొప్ప అవకాశమని 'రుద్రం' వ్యవస్థాపక అధ్యక్షురాలు షర్మిల రాఘవ అన్నారు. ఆర్ట్స్ కళాశాల మహిళా సాధికారత విభాగం సహకారంతో ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. మహిళల్లో ఆత్మరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు భారతీయ సంప్రదాయ యుద్ధకళల గొప్పతనాన్ని చాటిచెప్పడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ స్వాతి, ప్రొఫెసర్ మాయాదేవి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు ఆత్మరక్షణలో నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి, భారతీయ యుద్ధకళలపై అవగాహన పెంచుకోవడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.


రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ఉస్మాన్ పాషా





దశ, హుజురాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ పాషా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి అధ్యక్షతన,దామోదర్ రెడ్డి, సీతారామయ్య ఆధ్వర్యంలో జరిగింది. గతంలో ఉస్మాన్ పాషా రెండుసార్లు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై హుజురాబాద్ కు సేవలందించారు.అనంతరం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు.ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తన ఎంపికకు సహకరించిన జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రవీంద్రభారతిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



దశ, హైదరాబాద్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు మూడో రోజు ఘనంగా జరిగాయి. బండి పద్మజ నేతృత్వంలోని మున్నూరుకాపు సంఘం మహిళలతో పాటు వివిధ మహిళా సంఘాల సభ్యులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడారు. ఆటపాటలతో సందడి చేస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నరసింహారెడ్డి, ఐఏఎస్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.ప్రకృతిని, పూలను ఆరాధిస్తూ జరుపుకునే ఈ పండుగ మనిషికి, ప్రకృతికి మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు, కళాకారులు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో రవీంద్రభారతి ప్రాంగణం బతుకమ్మ పాటలు, నృత్యాలతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లాలాపేటలో ఘనంగా 'వెటరన్' టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

❖ *విజేతలకు బహుమతుల ప్రదానం*



దశ, ఓయూ: వెటరన్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ (వీటీటీఏ) లాలాపేట ఆధ్వర్యంలో 40 ఏళ్లు పైబడిన వారి కోసం నిర్వహించిన ఓపెన్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ జీహెచ్ఎంసీ స్టేడియంలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిశాయి. ముందస్తుగా పేర్లు నమోదు చేసుకున్న 48 మంది క్రీడాకారులకు మాత్రమే ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు.

క్రీడా నైపుణ్యాల పెంపే లక్ష్యం

క్రీడాకారులు తమ ఆటతీరును, నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుంటూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహించినట్లు అసోసియేషన్ కార్యదర్శి బేతి విట్టల్ తెలిపారు.

డిజిటల్ విధానంలో పోటీలు

ఈ టోర్నమెంట్ ప్రత్యేకత ఏంటంటే—శ్రీ రవీంద్ర రూపొందించిన 'టీటీ కనెక్ట్' అనే వెబ్ ఆధారిత పోటీల నిర్వహణ వ్యవస్థను తొలిసారిగా ఇక్కడ ప్రవేశపెట్టారు. ఈ నూతన సాంకేతిక వ్యవస్థ ద్వారా టోర్నమెంట్ నిర్వహణ అత్యంత వేగంగా, పారదర్శకంగా మరియు సులభతరంగా సాగింది. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారుల బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి అరుంధర్ తాటి, ద్వితీయ బహుమతి మందార్ కర్మల్కర్, తృతీయ బహుమతి ఆర్.జె. హరికృష్ణ, తృతీయ బహుమతి ఎన్. తాహెర్ తదితరులకు బహుమతుల ప్రదానం చేశారు. విజేతలకు వీటీటీఏ అధ్యక్షుడు శ్రీ దయాకర్ కుసుమ, కార్యదర్శి శ్రీ బేతి విట్టల్, గౌరవ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తొట, నిర్వాహకులు ఎం.వి. ఎన్. కిషోర్, బి. గోపీనాథ్ రావు తదితర కార్యవర్గ సభ్యులు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. పోటీలు విజయవంతం కావడానికి స్వచ్ఛందంగా అంపైరింగ్ బాధ్యతలు నిర్వహించిన క్రీడాకారులకు, 'టీటీ కనెక్ట్' వ్యవస్థను అందించిన శ్రీ రవీంద్రకు, అలాగే పూర్తి సహకారం అందించిన జీహెచ్ఎంసీ అధికారులు, స్టేడియం సిబ్బందికి వీటీటీఏ ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



ఇనాంగూడ మత్స్యశాఖ కోఆపరేటివ్ అధ్యక్షునిగా పిట్టల శ్రీశైలం ముదిరాజ్ ఎన్నిక

దశ, అబ్దుల్లాపూర్ మెట్: అబ్దుల్లాపూర్ మెట్ మండలం ఇనాంగూడ గ్రామ మత్స్యశాఖ కోఆపరేటివ్ ప్రై.లి అధ్యక్షునిగా పిట్టల శ్రీశైలం ముదిరాజ్‌ను (తండ్రి సత్తయ్య ముదిరాజ్ మాజీ ఉప సర్పంచ్) సోమవారం బైరాన్ ఖాన్ చెరువు పెద్దమ్మ దేవాలయం ఆవరణంలో ఎన్నుకున్నారు. గ్రామ పెద్దలు, మాజీ అధ్యక్షులు పిట్టల రాజు ముదిరాజ్, గ్రామ ఉపసర్పంచ్ పిట్టల బాలశివుడు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి మత్స్యశాఖ కోఆపరేటివ్ మొయినాబాద్ శాఖ జూనియర్ ఇన్స్పెక్టర్ ఎండి అమీర్ ఖాన్ హాజరై కమిటీని ఎన్నిక చేశారు. ఉపాధ్యక్షుడిగా పిట్టల బాలరాజు, కార్యదర్శిగా పిట్టల శ్రీశైలం, డైరెక్టర్లుగా పిట్టల రాజు, అండాలు, భాస్కర్, శ్రీనివాస్, అండాలు, భరత్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీశైలం ముదిరాజ్ మాట్లాడుతూ పెద్దల నిర్దేశంలో నడుచుకుంటూ అభివృద్ధిలో ముందుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వం అందించిన వనరులను సద్వినియోగం చేసుకుంటమన్నారు. ఈ కార్యక్రమంలో పోన్నయ్య, సురేష్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణికి 102 ఫిర్యాదులు

❖ *రెవెన్యూ శాఖకు 49.. ఇతర శాఖలకు 53 అర్జీలు*

దశ, రంగారెడ్డి: జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 102 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్లు కిరణ్మయి, చంద్రారెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 49, ఇతర శాఖలకు 53 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేణుక గోల్డెన్ సిటీలో డ్రైనేజీ, విద్యుత్ సమస్యలు



❖ *సమస్యలను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన గ్యారల శ్రీనివాస్ గౌడ్*

దశ, పెద్ద అంబర్‌పేట: పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని రేణుక గోల్డెన్ సిటీలో నెలకొన్న డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల సమస్యలను కాలనీవాసులు జీఎస్ సేవా సమితి చైర్మన్, మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్యలను స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించడంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. డ్రైనేజీ, విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కాలనీలోని సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

పసుమాములలో ఘనంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు



దశ, పెద్ద అంబర్‌పేట: పెద్ద అంబర్‌పేట పరిధిలోని పసుమాముల గ్రామంలో అయ్యప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తూ భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ చెట్టి నవీన్ గౌడ్, మాజీ కౌన్సిలర్ గౌని భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు గ్రామంలో భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తున్నాయి.

జలాల సంరక్షణ కోసం చివరి ఊపిరి వరకు కృషి సాగిస్తా

- *శాశ్వత కరవు నివారణకు సమగ్ర వ్యూహం అవసరం*
- *ఎన్ డిఎంఏ మాజీ ఉపాధ్యక్షులు మర్రి శశిధర్ రెడ్డి*

దశ, హైదరాబాద్ : జలాల సంరక్షణ కోసం చివరి ఊపిరి వరకు తన కృషి కొనసాగుతుందని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ మాజీ ఉపాధ్యక్షులు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్ రెడ్డి అన్నారు.

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో పెరుగుతున్న కరవును ఎదుర్కొనేందుకు తాత్కాలిక చర్యలకు బదులుగా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.

సోమవారం నాడు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 'చతుర్విధ జలప్రక్రియ' (ఫోర్ వాటర్స్ కాన్సెప్ట్) ను అమలు చేయడం ద్వారా కరవు నివారణ సాధ్యమని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షపాతం లోటు, నీటి నిల్వల తగ్గుదలతో వ్యవసాయం దెబ్బతింటోందని తెలిపారు. గతంలోనూ వరుస కరువులు



భూగర్భ జలాలను అడుగంటించి, గ్రామీణ ప్రజల జీవనోపాధిని దెబ్బతీశాయని పేర్కొన్నారు. నాలుగు నీటి విధానంతో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. దివంగత నీటిపారుదల నిపుణుడు టి. హనుమంతరావు రూపొందించిన ఈ విధానాన్ని 2001లో తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో అమలు చేయగా మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు.

సంగారెడ్డి జిల్లా గొట్టిగారిపల్లి గ్రామం వరుస కరవులను తట్టుకుని మూడు పంటలకు నీటిని అందించిందని తెలిపారు. రాజస్థాన్‌లోనూ ఈ విధానాన్ని అమలు చేసినట్లు పేర్కొన్నారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, నేలకోత నివారణ, కరవు కాలంలోనూ నీటి లభ్యత ఈ విధానం ప్రధాన ప్రయోజనాలని వివరించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఎకరాకు సుమారు రూ.15 వేల వ్యయంతో అమలు చేయవచ్చని తెలిపారు.

దేశంలోని వర్షాధార భూముల్లో ఈ విధానాన్ని విస్తరించడం ద్వారా రైతులకు నీటి భద్రత కల్పించడంతో పాటు, కరవు సహాయక చర్యలపై ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించవచ్చని మర్రి శశిధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

ఈ విషయంలో తాను ప్రధాని నరేంద్రమోడీని కలిసి, దేశవ్యాప్తంగా దీని అమలుకు అభ్యర్థించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జస్టిస్ సుభాషన్ రెడ్డి ట్రస్ట్ నిర్వాహకులు ఇంద్రసేనారెడ్డి కూడా పాల్గొన్నారు.